ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 16 సెప్టెంబరు 2025 | 5

జీవన ఎరువులతో యూరియాకు చెక్! 6

జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్

» సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు 6

విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజనీర్లు ముందుకు సాగాలి

» జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి పులి రామకృష్ణారెడ్డి

అమలాపురంటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిని ఇంజనీర్లు కొనసాగించాలని జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి పులి రామకృష్ణారెడ్డి సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ఆవరణలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మెమెంటోలు అందించి సత్కరించారు. విశ్రాంత ఇంజనీర్ సీహెచ్ రామకృష్ణ తదితరులను సత్కరించారు. కోనసీమలో వంతెనలు, రోడ్ల నిర్మాణానికి విశ్వేశ్వరయ్య స్ఫూర్తి అని స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబు, డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్ అన్నారు. 120మంది జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. డీఈఈ శ్రీనివాస్, ఏఈఈలు కొండలరావు, సత్యనారాయణ, సంపన్న, సంధ్య పాల్గొన్నారు.



అమలాపురంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా విడుదల

» మొత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,353 ఖాళీలు

» 1,349 మంది అభ్యర్థుల ఎంపిక

» భర్తీకాని ఉద్యోగాలు.. నాలుగు

» కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి మేనేజ్‌మెంట్, పోస్టుల వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించారు. వాటిని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రదర్శనకు ఉంచారు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితాలను apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లకు మొత్తం 1,241 ఉద్యోగాలను నోటిఫై చేయగా 1237మంది అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో 621మంది పురుషులు, 616మంది మహిళలు ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మేనేజ్‌మెంట్‌లో మొత్తం 112 ఉద్యోగాలను నోటిఫైచేయగా 112మంది ఎంపిక కాగా వారిలో పురుషులు 33మంది, మహిళలు 79మంది ఉన్నారని డీఈవో తెలిపారు. తుది ఎంపిక జాబితాలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఏమైనా అభ్యంతరాలు కానీ, సందేహాలు కానీ ఉంటే తగిన ఆధారాలతో కాకినాడ డీఈవో కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని, 7989750963, 7799698462 నెంబర్లలో సంప్రదించవచ్చని డీఈవో సూచించారు.



రాష్ట్రానికి సీఎం ఎంతో.. జిల్లాకు కలెక్టర్ అంత!

సదస్సులో సీఎం చంద్రబాబు,

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



» రెండు రోజుల కలెక్టర్ల సదస్సును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

» అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్లతో సమీక్ష

» జిల్లాకు వివిధ రంగాల్లో గ్రేడ్‌ల ప్రకటన

అమలాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'దేశంలో ప్రధాని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంత ప్రాముఖ్యత కలిగిన వ్యక్తులో అదే ప్రాముఖ్యత కలిగిన జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పోటీతత్వంతో ముందుకు నడిపించి ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి' అని ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. అమరావతిలో సోమవారంనుంచి రెండురోజులపాటు జరిగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయన ప్రసంగించారు. కొత్త, పాత కలెక్టర్లకు తొలుత అభినందనలు తెలిపిన ఆయన పాత కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జిల్లాల అభివృద్ధికి సంబంధించిన ప్లానింగ్, పొలిటికల్ గవర్నెన్స్, పాలసీలు మేనేజ్‌మెంట్‌పై మాట్లాడారు. పొలిటికల్ గవర్నెన్స్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చూసుకుంటారని, జిల్లా ప్లానింగ్‌కు సంబంధించిన బాధ్యత కలెక్టర్లు తీసుకుని నడిపించాలని సూచించారు.

తొలిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఆర్.మహేష్ కుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్)కు సంబంధించి ఈ సదస్సులో చర్చించారు. ఎకనమిక్ గ్రోత్ ప్రొజెక్షన్, ఏపీజీఎస్డీపీ టార్గెట్స్, ఎచీవ్‌మెంట్స్‌పై చర్చించారు. కీ పెర్ఫార్మెన్ ఇండికేటర్స్(కేపీఎల్ఎస్)కు సంబంధించి స్వర్ణాంధ్ర విజన్ మోనటరింగ్ ఫ్రేమ్ వర్కు, స్కోరింగ్ మెథడాలజీ, జిల్లాలు, మండలాల వారీగా సమీక్ష, సాధించిన ర్యాంకులను వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధి, సర్వీసు సెక్టార్, ఏపీ గ్రాస్ వాల్యూ యాడెడ్‌పై సీఎం సమీక్ష చేశారు. 2047 లక్ష్యంగా ప్రభుత్వం వివిధ రంగాల అభివృద్ధికి సంబంధించి టార్గెట్లు ప్రకటించింది.

గ్రాస్ డిస్ట్రిక్ట్, డొమెస్టిక్ ప్రొడక్ట్‌కు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 2025-26 టార్గెట్ జీడీడీపీ 55,504కి 17.45శాతం ప్రగతి లక్ష్యం కాగా మొదటి క్వార్టర్‌లో 10,673తో 19.23శాతం సాధించారు. 2, 3, 4 క్వార్టర్లకు సంబంధించి 80.77శాతంతో 44,831 జీడీడీపీ సాధించాల్సి ఉందని ప్రకటించారు.

62 స్కోరుతో గ్రేడ్-బి

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో భాగంగా స్వర్ణాంధ్ర విజన్‌ను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో అచీవ్‌మెంట్స్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీంట్లో హౌసింగ్, ట్రాన్స్‌పోర్ట్, కన్స్యూమర్ ఎఫైర్స్, ట్రైబల్ వెల్ఫేర్, ఫైనాన్స్ సెక్రటేరియట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ, లేబర్ ఎంప్లాయిమెంట్ వంటి మొత్తం 15అంశాలకు సంబంధించి గ్రేడింగ్ నిర్ణయించారు. దీనిలోభాగంగా జిల్లాకు సంబంధించి జిల్లా 62 స్కోరుతో గ్రేడ్-బితో నిలిచింది. స్వర్ణాంధ్ర కేపీఎల్ఎస్‌లో

కోనసీమ జిల్లా ప్రగతి సూచికలు ఇలా..

జిల్లాకు సంబంధించి అయినవిల్లి మండలం 54 పాయింట్లతో బి గ్రేడ్‌లో నిలిచింది.

అగ్రికల్చర్ అండ్ ఎలైడ్‌లో సి-గ్రేడ్

ఏపీ అగ్రికల్చర్ ఎలైడ్ జీవీఏ 2024-25 కరెంట్ ప్రైస్‌కు సంబంధించి రాష్ట్రస్థాయిలో రూ.57,240 కోట్లు ఉండగా 2025-26 టార్గెట్‌ను రూ.65,765 కోట్లకు పెంచారు. హార్టీకల్చర్, లైవ్‌స్టాక్, ఫారెస్ట్, ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్‌కు సంబంధించి లక్ష్యాలను నిర్దేశించారు. అగ్రికల్చర్ అండ్ ఎలైడ్ సెక్టార్‌లో ర్యాంకింగ్‌ను ప్రకటించింది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాకు 29 పాయింట్లతో సి-గ్రేడ్ ప్రకటించారు.

జీవీఏ ఇలా..

2025-26 జీవీఏ టార్గెట్‌గా రాష్ట్రస్థాయిలో రూ.21,253 కోట్లుగా నిర్ణయించారు. టార్గెట్ గ్రోత్‌ను 16.50శాతంగా ప్రకటించారు. ఇప్పటివరకు 2025-26 సంవత్సరానికి సంబంధించి 3,540 జీవీఏ అచీవ్ అయింది. జీవీఏ రీజియన్ వారీగా గణాంక వివరాలు కోనసీమ జిల్లాకు సంబంధించి ఇలా ఉన్నాయి. కోనసీమ జిల్లాలో మండపేట మండలంలోని వెలగతోడు-2 ఆర్ఎస్కేకు సంబంధించి అగ్రికల్చర్‌లో 9, ఏహెచ్‌కు సంబంధించి 506, మొత్తం జీవీఏ 515 సాధించింది. పశుసంవర్ధకశాఖకు సంబంధించి కోనసీమ జిల్లా 2024-25కు రూ.5,324 కోట్లు జీవీఏ సాధించింది. ఏపీ పారిశ్రామిక సెక్టార్ జీవీఏతో పాటు 80 పాయింట్లతో ఏ గ్రేడ్ దక్కించుకుంది. జిల్లాస్థాయిలో 13,767 జీవీఏ టార్గెట్ కాగా 18.58 శాతం గ్రోత్ సాధించారు. 2025-26లో 2659 జీవీఏ నిర్ణయించారు. సర్వీసు సెక్టార్‌కు సంబంధించి కోనసీమ జిల్లా 88 పాయింట్లతో ఏ గ్రేడ్ దక్కించుకుంది. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణ, పీఎం జ్ఞానం పథకాల కింద చేపడుతున్న హౌసింగ్ నిర్మాణాల తీరుపై ప్రభుత్వం కలెక్టర్ల సమీక్షలో విశ్లేషించింది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



» ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుయంత్రాంగం అవిశ్రాంతంగా కృషి చేసే విధంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా వెల్లడించారు. అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపడంతోపాటు దాన్ని సేవించడంవల్ల వక్రమార్గం పడుతున్న యువతలో మార్పు తీసుకువస్తామని వెల్లడించారు. ముఖ్యంగా మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, కుల వైషమ్యాలు రెచ్చగొట్టడం, ఫ్లెక్సీల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు ప్రచారం చేయడం వంటి అంశాలపై పోలీసులు దృష్టిసారిస్తారన్నారు. గతంలో పనిచేసిన ఎస్పీలు అరాచక శక్తులను అణచి వేసేందుకు చేసిన ప్రక్రియను కొనసాగిస్తామన్నారు. ఇష్టానుసారంగా యువత వాహనాలపై అల్లర్లు, అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాహుల్‌మీనా హెచ్చరించారు. కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తాను జిల్లావ్యాప్తంగా పర్యటించి పరిస్థితులను ఆకలింపు చేసుకుంటానని, ప్రజలంతా శాంతి భద్రతల విషయంలో పూర్తి సహకారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 260 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి మరింత బలం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండాలని జేసీ టి.నిషాంతి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో జిల్లాస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలుతప్పవని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి అన్నారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, పి.కృష్ణమూర్తి, డీఎల్డీవో వేణుగోపాల్‌తో కలిసి జిల్లా నలుమూలలనుంచి వచ్చిన వారినుంచి జేసీ 260 అర్జీలను స్వీకరించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 23 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తొలిసారిగా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 23 అర్జీలను ఎస్పీ స్వీకరించారు.



పోలీసు కార్యాలయంలో సమస్య వింటున్న ఎస్పీ రాహుల్ మీనా

'విద్యాశక్తి'తో.. ఉపాధ్యాయులపై పనిభారం



విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

» బోధనేతర పనులే కారణమంటున్న టీచర్లు

» వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ముందుకు తీసుకువెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిపై ఒక జీవోను కూడా తీసుకువచ్చింది. పాఠశాల తరగతుల అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి గణితం, సైన్సు, ఆంగ్ల భాషలపై పట్టు సాధించే దిశగా ఈ విద్యాశక్తి కార్యక్రమాన్ని రూపొందించారు. కార్యక్రమం మంచిదే అయినా తమపై పనిభారం పెరుగుతోందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడంతో వారికి ఈ కార్యక్రమం భారంగా మారింది.

పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు వారీగా ప్రతిరోజూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిభారంలో నిమగ్నం కావాల్సి వస్తోంది. 9గంటలు వారు బోధనలో పనిచేయాల్సి ఉంటుంది. ఇది కాక విద్యార్థుల హాజరు, వారి ప్రోగ్రెస్, పుస్తకాల పంపిణీ, ఫొటోల అప్‌లోడ్, ఉపాధ్యాయుల హాజరు, శిక్షణ తరగతులు వంటి 40 పనులకు సంబంధించి లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయులపై పనిభారం మరింత పెరిగింది. విద్యాశక్తి కార్యక్రమం తమకు భారంగా మారిందని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈకార్యక్రమాన్ని బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్దరాదని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఉపాధ్యాయ సంఘాలు వినతిపత్రం అందించారు. మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించాయి. విద్యాశక్తి కార్యక్రమం ఉద్దేశం మంచిదే అయినప్పటికీ ఉపాధ్యాయులపై భారం పెరుగుతోంది. బోధనేతర పనులకు అదనపు బోధనలకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి వారితో ఈ పనులు సాగిస్తే ఉపాధ్యాయులకు వెసులుబాటు కలిగి విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

పని భారం పెరిగింది

-ఎస్ఎన్ మునేశ్వరరావు, టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు



ఉపాధ్యాయులు రోజుకు 9గంటలు పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తుంది. పదో తరగతి విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఉదయం 8 నుంచి 9గంటల వరకు సాయంత్రం 4గంటలనుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించాల్సి వస్తుంది. దీనికితోడు లీప్ యాప్‌లో 40 రకాల పనులు అప్‌లోడ్ చేయాల్సి వస్తుంది. దీంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుంది.

బోధన వెనుకబడుతుంది

-ఎంటీవీ సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్



ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించడంతో బోధన వెనుకబడుతుంది. ఎసెస్‌మెంట్ బుక్స్, హోలిస్టిక్ కార్డులు వంటి వాటిని పూర్తిచేయడంలో ఉపాధ్యాయులు నిమగ్నం కావాల్సి ఉన్నందున బోధనలో వెనుకబడే పరిస్థితినెలకొంది. విద్యాశక్తిలో 6 నుంచి 9వ తరగతి పిల్లలకు అదనపు తరగతులు నిర్వహించడంవల్ల ఉపాధ్యాయులపై మరింతభారం పెరుగుతోంది.

'చేనేత సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి'

అమలాపురంరూరల్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): చేనేత సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పుత్సల వరదరాజులు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందించారు. చేనేతవస్త్రాలపై 30 శాతం రిబేటు పునరుద్ధరించాలని, ఆప్కో బకాయిలు చెల్లించాలని, 200 యూనిట్ల ఉచితవిద్యుత్ సరఫరాను వెంటనే అందించాలని విజ్ఞప్తిచేశారు. మాజీ ఎంపీటీసీలు ఆశపు చిన్నీ, మాడా మాధవి,కొండా రాజు, శ్రీనివాసరావు, కాశిన బాబి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, సర్పంచ్ పెనుమాల సునీత-ఏడుకొండలు పాల్గొన్నారు.

యూరియా కొరతపై కలెక్టరేట్ వద్ద కిసాన్ కాంగ్రెస్ ధర్నా



అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు

» నాయకత్వం వహించిన రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు

అమలాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సరిపడేలా రైతులకు యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రీవెన్స్‌లో ఉన్న జేసీ నిషాంతికి అందజేశారు. కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అల్లూరి మధురాజు, రాష్ట్ర నాయకులు దేశినీడి ఉదయభాస్కర్, మీసాల బాబి, యార్లగడ్డ రవీంద్ర, నీతిపూడి బాలసత్యనారాయణ, ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ, సంగీత సత్యనారాయణ, దేవరపల్లి రాజేంద్రప్రసాద్, వడ్డి నాగేశ్వరరావు, ఏబీ డబ్ల్యుజే రెడ్డిబాబు, కుడుపూడి శ్రీనివాస్, చిట్టూరి వీరవెంకటసత్యనారాయణ, అప్పన శ్రీరామకృష్ణతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన కిసాన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం యూరియా కొరతకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆధార్ లింక్‌తో ప్రతి రైతుకు ఒక బస్తా మాత్రమే సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తోందని కామన ప్రభాకరరావు ఆరోపించారు. రైతులందరికీ యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

అమలాపురం పట్టణ సమగ్రాభివృద్ధికి.. ప్రత్యేక ప్రణాళిక

» ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పన చేసినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టి.చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమలాపురంప్రాంతంలో ప్రధాన పంటకాల్వపై రెండు వంతెనలు,కామనగరువు వద్ద మరో వంతెన, విత్తనాలవారి కాల్వగట్టు ప్రాంతంలో ఒక వంతెన నిర్మాణానికి కృషిచేస్తున్నట్టు తెలిపారు. అమలాపురం పట్టణపరిధిలో రూ.100కోట్లతో విశాలమైన రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అమలాపురం-చల్లపల్లి-ఎస్.యానాం ప్రధాన పంటకాల్వకు రక్షణగోడ నిర్మాణంచేస్తామన్నారు. రూ.3కోట్లతో అమలాపురం డిగ్రీకళాశాల భవననిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సహకారంతోపాటు స్థానిక చమురు సంస్థలద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నట్టు వివరించారు. అవసరమైతే చమురు సంస్థలతో పోరాడి నిధులసాధనకు కృషిచేస్తామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, కూటమినాయకులు నిమ్మకాయల చెల్లయ్య, గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, దంగేటి బాబులు, దంగేటి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు

న్యూఢిల్లీ సదస్సులో గోకివాడ సర్పంచ్

గ్రామాల అభివృద్ధిపై చర్చ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలోని తాగునీరు, పారిశుధ్య విభాగాలు, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా న్యూఢిల్లీలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన సదస్సులో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు పాల్గొన్నారు. స్వచ్ఛ సుజల్, నారీబల్‌మిత్ర, సమృద్ధి, సురక్ష, సంపన్న పంచాయతీల ప్రాతిపదికన దేశ వ్యాప్తంగా ఉన్న 75 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. గ్రామాల్లో తాగునీరు, సంపూర్ణ పారిశుధ్యం, అభివృద్ధి తదితర అంశాలపై సర్పంచ్ హరనాథబాబు మాట్లాడగా, మిగిలిన సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొని సర్పంచ్‌లకు 100 రోజుల చాలెంజ్ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. గోకివాడ సర్పంచ్‌కు కేంద్రమంత్రి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సర్పంచ్ హరనాథబాబు



మహిళా ప్రతినిధులతో ఎమ్మెల్సీ పద్మశ్రీ

జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్లో రెండో రోజులు జరిగిన జాతీయ మహిళా సాధికారిత సదస్సులో కాకినాడ నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రాతినిధ్యం వహించారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, ఏపీ శాసనసభ మహిళా కమిటీ చైర్‌పర్సన్ చరితారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మహిళా ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పద్మశ్రీ

జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్

- కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి రాంబాబు



రాయవరం హైస్కూల్‌లో పాల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్ (పర్సనలైజ్డ్ అసెస్‌మెంట్స్ లెర్నింగ్) మంజూరయ్యాయని, వీటిని ఉపాధ్యాయులంతా వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సూచించారు. సోమవారం రాయవరం శ్రీరామయ్య జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్ ల్యాబ్స్ వినియోగించుకుంటున్న తీరుపై హెచ్ఎం వీ.శాంతి సునీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 31 ఉన్నత పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



బర్నేకు మొక్కను అందజేస్తున్న నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్ పల్ల వెంకటేష్

కడియం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడియం పల్ల వెంకన్న నర్సరీని సోమవారం మహారాష్ట్ర శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్, సౌర విద్యుత్ కేంద్ర కమిటీ సభ్యుడు, ఎంపీ రంగ్ అప్పా బర్నే సందర్శించారు. వారికి నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్లు వెంకటేష్, వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా బర్నే మాట్లాడుతూ పిఠాపురం పాదగయకు వచ్చిన తాను కడియం వచ్చినట్లు తెలిపారు. నర్సరీలో దేశ, విదేశీ మొక్కలతో కూర్పు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయన్నారు. సోలార్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జీవన ఎరువుల డబ్బా



యూరియా దొరకదేమోనని
రైతులను వెంటాడుతున్న
భయం....
యూరియా కృత్రిమ కొరత
కొరతను అరికట్టేందుకు
అధికారుల పరుగులు...
యూరియా కొరత లేదంటున్న
అధికారులు....
కొరత ఉందంటూ
వైసీపీ నిరసనలు....
అసలు యూరియాకు అంత
డిమాండ్ ఏమిటి అన్న చర్చ
ప్రస్తుతం అందరిలోనూ
నడుస్తోంది.
యూరియాకు ప్రత్యామ్నాయం
ఏమీ లేదా అంటే
జీవన ఎరువులు ఉన్నాయని
ప్రకృతి వ్యవసాయ నిపుణుడు
అడ్డాల గోపాలకృష్ణ చెప్తున్నారు.
ప్రకృతి వ్యవసాయంతో ఎరువుల
వినియోగం తగ్గించడమే కాకుం
డా భూసారాన్ని ఎంతగానో పెం
పొందించవచ్చని ప్రకృతి వ్యవసా
యాధికారి శ్రీనివాస్ చెప్తున్నారు.

జీవన ఎరువులతో యూరియాకు చెక్!



నానో ఎరువుల డబ్బాలు



యూరియా బస్తా

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

యూరియా కొరత విషయంలో ధర కూడా ప్రభావం చూపిస్తుంది. యూరియా బస్తా ధర కేవలం రూ.267 మాత్రమే. కానీ యూరియా బస్తా ఒక్కింటికి కేంద్ర ప్రభుత్వం ఎంత రాయితీ ఇస్తుందో రైతు సంఘాల నాయకులు అందరికీ కూడా తెలియదు. యూరియా బస్తా ధర వాస్తవానికి రూ.1457.29. కాగా కేంద్రం ప్రభుత్వం 50 కిలోల యూరియా బస్తాకు రూ.1190.79 రాయితీ ఇస్తోంది. దాంతో రైతులకు ఒక్కో బస్తా రూ.267కే అందిస్తున్నారు. యూరియాకు రాయితీ ఉండడం, కాంప్లెక్సు ఎరువులకు లేకపోవడం కూడా ఇందుకు కారణం. యూరియా కలిసి ఉన్న కాంప్లెక్సు ఎరువుల బస్తా రూ.1,350 నుంచి పైమాటే. పంట పరిపూర్ణంగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు ఎంతో దోహదపడతాయని జిల్లా అధికారులు ప్రచారం చేసినా రైతులు మాత్రం యూరియాపైనే దృష్టి సారిస్తున్నారు. ఇక నానో ఎరువుల తయారీలో భాగంగా యూరియాను తక్కువ ధరకే సిద్ధం చేసిన తయారీదారులు తగినంత ప్రచారం లేకపోవడం, ఒక్కసారిగా రైతులు కొత్త విధానాన్ని అనుసరించకపోవడంకూడా ఇందుకు కారణం. ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి.

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు

యూరియాలో 90 శాతానికి పైగా నత్రజని ఉంటుంది.దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు, అధికారులు చెప్తున్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు అయిన రైజోబియం, అజతోబాక్టర్, అజస్పైరిల్లం, నీటి ఆకుపచ్చ నాచు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు...


జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు సాధించవచ్చు. భూసారం మెరుగుపడుతుంది. జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల బెడద తగ్గి 10 నుంచి 20 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట ఉత్పత్తుల్లో ఎక్కడా క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండవు. జీవన ఎరువులను ఒకసారి వినియోగిస్తే తదుపరి వాటంతట అవే వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

రైజోబియం...

ఇది పైర్ల వేర్లపై బుడిపెలు కలుగజేసి సహజీవనం చేస్తూ గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరాకు 40 కిలోల నత్రజని సహజసిద్ధంగా పైరుకు లభ్యం అవుతుంది. అదే విధంగా అజోస్పైరిల్లం, ఆకుపచ్చ నాచును వాడడం వల్ల పైరుకు, చేలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

జీవన ఎరువులతో ప్రశాంతంగా సాగు

అడ్డాల గోపాలకృష్ణ, అమలాపురం



యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. కానీ జీవన ఎరువులు వినియోగించే రైతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంతంగా సాగు చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను మరింత ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక రాయితీలు కూడా కల్పించాలి. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, మీనామృతం వంటివి మొక్కలకు నత్రజనిని అందించడంలో కీలకంగా పనిచేస్తాయి.

నూతన ఆవిష్కరణలు దిశగా సాగాలి

- అద్విక-25లో నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నన్నయ జ్ఞానం, విశ్వేశ్వరయ్య శ్రద్ధ రెండింటి నుంచి ప్రేరణ పొంది నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో అద్విక-25 ఇంజనీరింగ్ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నన్నయ విగ్రహానికి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ జాతినిర్మాణానికి విశ్వేశ్వరయ్య చేసిన అసమానమైన కృషిని నేడు అంతా అనుభవిస్తున్నారన్నారు. అనంతరం ఓరియంటేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అద్విక ఉత్సవంలో విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ బి.వెంకటగిరి, డీఈఈ టి.శ్రీనివాసబాబు, ఏఈ వి.అవినాష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఈఈ రవికుమార్, ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్(ఐసీఐ) రాజమహేంద్రవరం సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ కేవీ నరసింహారావు, ఓఎన్‌జీసీ విశ్రాంత ఈఈ జీవీఎస్ ప్రసాద్, ఇంజనీర్ హరికుమార్, విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ అధ్యాపకులు, ఇంజనీర్లను వీసీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యారులు, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

జేఎన్టీయూకే: భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కాకినాడ జేఎన్టీ యూ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ కేఎల్ రావు సెమినార్ హాల్లో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను సోమవారం కె.పద్మకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు ప్రసాదరాజు, మురళీకృష్ణ, ఉదయభాస్కర్,శ్రీనివాసులు, తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ నేటితరం ఇంజనీర్లు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

●165వ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూకే, ఐఈ కాకినాడ లోకల్ చాప్టర్, ఆర్ఐఈఏ ఆధ్వర్యంలో వర్సిటీలోని ఐఈ సెమినార్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏఐ, రోబోటిక్స్‌కి అనుకూలమైన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని సూచించారు.



కాకినాడలో మోక్షగుండం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు

నిలకడగా గోదావరి

- ధవళేశ్వరం వద్ద పెరుగుదల..
- 5,54,609 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద నిదానంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 5,5,609 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా, నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదయ్యింది. ఎగువున భద్రాచలం వద్ద 39.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఇదే ఒరవడి కొనసాగితే ధవళేశ్వరం వద్ద 6 లక్షల క్యూసెక్కులు వరకు తరలివచ్చి ఆపై నీటిమట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



పందలపాక నుంచి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాల నుంచి అండర్-19 స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. వీరు ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో సీహెచ్ కార్తీకసూర్య, ఎల్.సతీష్, జీ.దినేషవర్ధన్ ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, తదితరులు అభినందించారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దాం

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- బలభద్రపురంలో మొదటి రోజు 169 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గ్రామంలోని సచివాలయం-2లో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రంగరాయ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 1,295 మందికి పరీక్షలు జరపగా, 65 మంది బాధితులు ఉన్నట్టు గుర్తించారని, దీంతో మిగతావారు భయపడి పరీక్షలు చేయించుకోలేదన్నారు. అలాంటి వారు సోమవారం 169 మంది స్క్రీనింగ్ టెస్టులకు హాజరయ్యారు. బసవతారకం ఆసుపత్రి నుంచి వచ్చిన వారిలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రావణ కుమారి, డా. ప్రవల్లిక, డా. రేణుక, రేడియాలజిస్ట్ డా. ప్రభాకర్, అంకాలజిస్ట్ డా. కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డా. దుర్గాదేవి, డా. రుమన్, డా. విజయలక్ష్మీ, డా.గణేష్‌పట్నాయక్ ఈస్క్రీనింగ్ టెస్టులు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటి చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, కూటమి నేతలు ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'బాక్సింగ్' పోటీల్లో మహాలక్ష్మికి గోల్డ్‌మెడల్

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కళాశాలల యూత్ బాక్సింగ్ అండర్-19 పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ ఫస్టియర్ విద్యార్థిని పల్లా మహాలక్ష్మి గోల్డ్‌మెడల్ సాధించింది. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను, ఆమె తండ్రిని, కోచ్ పి.లక్ష్మణరావును ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కేశవరావు అభినందించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శారద, అరుణ, చిన్నబ్బాయి, ఎస్కే హుస్సేన్, మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దేవరపల్లి కాశీవిశ్వనాథం, ఆఫీస్ ఇన్‌చార్జి పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా యోగా పోటీల్లో 8-14 సంవత్సరాల కేటగిరీలో పాఠశాలకు చెందిన కె.పవిత్ర (ప్రథమ), జీ.విజయప్రభ (ద్వితీయ), 14-18 సంవత్సరాల కేటగిరీలో కే.సమంత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరిని ఎంఈవో జీ.శ్యాంబాబు అభినందించారు. ఉపాధ్యాయులు లీలాదేవి, పద్మావతి, శ్రీవల్లి, పీడీ మంగాయమ్మ, పీఈటీ సత్యప్రియ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్యాంబాబు

రైతుల కష్టాలు చెప్పుతున్నాయి!

యూరియా కోసం అర కిలోమీటరు క్యూ



ఎటపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత...దాని కోసం రైతులు పడుతున్న కష్టాలకు ఈ చిత్రాలే నిదర్శనం. అల్లూరి జిల్లా ఎటపాక మండలం తోటపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దీంతో చుట్టుపక్కల 10 గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామున 3 గంటలకే రైతు సేవా కేంద్రానికి వచ్చారు. యూరియా ఎరువులు పొందేందుకు తమ వంతుగా చెప్పులతో క్యూ కట్టారు. సుమారు అర కిలోమీటరు వరకు చెప్పులతో క్యూ కనిపించింది.

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలురు, బాలికలకు టెన్నిస్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ఎలిజిబిలిటీ ఫార్మ్, మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకునిరావాలన్నారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 9059317248, సుధారాణి 9603504337 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పులిమచ్చల టేకు చేప చిక్కింది..



అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు చిక్కిన పులిమచ్చల టేకు చేప

అంతర్వేది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు అరుదైన చేప చిక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు సుమారు పది కిలోల పులిమచ్చల టేకు చేప పాట దొరకగా వేలం పాట నిర్వహించారు. దీనిని స్థానికులు వింతగా చూశారు. ఈ చేప పొట్ట భాగంలో, బ్లాడర్‌లో ఔషధ గుణాలు ఉండడంతో ఎక్కువగా మందుల తయారీలో ఉపయోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. ఈ చేప ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తూనే ఉంటుందని, అప్పుడప్పుడు చిక్కుతూ అదృష్టం తెచ్చిపెడుతుందన్నారు.

రూ.2.07 లక్షల విలువైన బాణసంచా సామగ్రి సీజ్



జొన్నాడలో సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేష్

ఆలమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ శివారు జాతీయ రహదారి సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని ఆలమూరు పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నాడలో జాతీయ రహదారికి దగ్గర్లో కొవ్వూరి సుధాకరరెడ్డి రేకులషెడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి రూ.2,07,165 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

భవనం పైనుంచి పడి మహిళ మృతి



దుర్గ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పై నుంచి పడి మహిళా కూలీ అక్కడకక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరి గింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పర్లోవపేటకు చెందిన రాగితి దుర్గ (37)కు భర్త ముసలయ్య, కుమార్తె సత్యవేణి ఉన్నారు. కాగా ముసలయ్య చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుండగా అతడి భార్య దుర్గ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు తాపీ పనుల్లో కూలీగా పని చేస్తుంది. ఈ క్రమంలో సోమవారం సాంబమూర్తినగర్ మూడోవీధిలో మహ్మద్ జానీకి చెందిన నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో దుర్గ పనిచేస్తూ మూడో అంతస్తు పైకి ఇటుకలు మోస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కిందికి పడిపోయింది. తీవ్రగాయాల పాలైన దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న ఆమె భర్త ముసలయ్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

టీ తాగుతూ కుప్పకూలి మరణించిన కూలీ



సూర్యప్రకాశరావు (ఫైల్)

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ హోటల్ వద్ద టీ తాగుతూ కుప్ప కూలి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగింది. గ్రామానికి చెందిన బెంతుపల్లి సూర్యప్రకాశరావు (32) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్తూ హోటల్ వద్ద ఆగి టీ తాగుతూ గుండెపోటుతో వెనక్కి కుప్పకూలాడు. వెంటనే ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్ట వైద్యులు తెలిపారు. అతడి మృతితో భార్య గౌరీ, పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పరిధి ఆటోనగర్‌లోని ఒక మెకానిక్ షెడ్డులో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందాడు. రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణకుమార్ సాకేత్(35) ఆటోనగర్ లోని మెకానిక్ షెడ్డులో 15 ఏళ్లుగా పనిచేస్తు న్నాడు. భార్య కుమారుడు, కుమార్తెతో కలిసి రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. సాకేత్ ప్రతిరోజూ ఆటోనగర్‌కు వెళ్తుంటాడు. సోమవారం మెకానిక్ షెడ్డుకు వెళ్లిన సాకేత్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ షాక్ గురై స్పృహ కోల్పోయాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెకానిక్ షెడ్డులో సూపర్ వైజర్ బిక్రమ్‌సింగ్ ప్రమాద విషయాన్ని సాకేత్ భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. చికిత్స పొందుతూ సాకేత్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం అంబేడ్కర్ సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. గుర్తుతెలియని వృద్ధురాలు ఆదివారం రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆమెకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఆమె గత కొంతకాలంగా మురారి పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ తిరుగుతున్నట్టు మురారి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 9440904841కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాజీ క్రికెటర్ కన్నుమూత

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన మాజీ రంజీ ట్రోఫీ క్రికెటర్ ఎస్.సత్యదేవ్ (84) శనివారం రాత్రి కాకినాడలో అనారోగ్య సమస్యల కారణంగా కన్నుమూశారు. సత్యదేవ్ ఆల్‌రౌండర్. లెగ్ స్పిన్‌తో పాటు గూగ్లీ బౌలింగ్ చేసేవారు. 1964-65 సీజన్‌లో విశాఖపట్నం, హైదరాబాద్‌లో జరిగిన రంజీ మ్యాచ్‌లో అరంగేట్రం చేశారు. 1968-69 సీజన్‌లో తిరుచ్చిలో మద్రాస్ (తమిళనాడు)తో జరిగిన చివరి మ్యాచ్ ఆడారు. సత్యదేవ్ 16 మ్యాచ్‌లు ఆడి 503 పరుగులు చేశారు. ఒక సెంచరీ కూడా ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అధికారిగా పదవీ విరమణ చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్‌బాబు, తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్కా వెంకటేష్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి : చింతూరు ఐటీడీఏ పీవో

చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది సోమవారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద 39.60 అడుగుల మేర ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చింతూరు మండలం, చింతూరు వరరామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు మీద ఉన్న వంతెనను ఆనుకుని ఎగపోటు వరద ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని, ఐటీడీఏలో వరద కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం కూనవరం మండలం, కొండ్రాజుపేట, టేకులబోరుల నడుమ రహదారిపై వరద నీరు చేరిందని, జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని పీవో పేర్కొన్నారు.

వానొచ్చే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు వర్షంతో నీటితో నిండిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆ దృశ్యాలే ఇవి



కాకినాడలో జోరుగా కురుస్తున్న వర్షం



సామర్లకోటలోని ఓ వీధిలో వర్షం నీరు



కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని ఫ్లైఓవర్ పక్క వీధిలో వర్షపునీరు





పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షం నీటిలో వాహనదారుల ఇబ్బందులు

హుండీలు, మోటార్‌సైకిళ్ల చోరీ

నిందితుడికి మూడేళ్ల జైలు, జరిమానా

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలోని పలు ఆలయాల్లోని హుండీలు, మోటార్ సైకిళ్ల చోరీ చేసిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. 2024 జూలై 23న టేకిలో జరిగిన చోరీ ఘటనలపై అప్పటి ఎస్ఐ పరదేశి కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన రేవు శ్రీనివాస్ అలియాస్ తాడే శ్రీనివాస్‌కు ఒక్కొక్క కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానాతో పాటు జరిమానా కట్టకపోతే అదనంగా 3 నెలల వరకు జైలుశిక్ష విధించినట్టు తీర్పు చెప్పారని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విల్ల శ్రీరాములు ఫిర్యాదుదారుల తరుపున వాదించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

ఒమ్మంగిలో చోరీ

నగదు, వెండి, బంగారం మాయం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో రూ.లక్ష నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనికి సంబంధించి బాధితురాలు గుండ్రపు గని లక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంట్లోని బీరువా తెరిచి ఇంటి నిర్మాణం నిమిత్తం తీసుకున్న లోన్‌లో రూ.లక్ష నగదుతో పాటు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దుండగులు చోరీ చేశారని ఎస్ఐ లక్ష్మీకాంతం వద్ద వాపోయింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎల్‌పీవో కార్యాలయ ఏవోపై విచారణకు డీఆర్వో ఆదేశం

ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ డబ్బులు డిమాండ్

విచారణ అధికారిగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డీడీ శోభారాణి నియామకం


కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జిల్లా పంచాయతీ శాఖలో పనిచేస్తున్న పలువురు ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ ఆ ఫిర్యాదులు క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై కాకినాడ డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో సీహెచ్ వెంకటరెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై డీఆర్వో జె.వెంకట్రావు విచారణకు ఆదేశించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.చంగలరావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చంగలరావు మాట్లాడుతూ యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ పంచాయతీకి సుమారు 3 నెలల క్రితం సియోన్ కుమార్ అనే ఎస్సీ కులానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని ట్రాన్స్‌ఫర్ ద్వారా నియమించడం జరిగిందన్నారు. అతను తమకు తెలిసినంత వరకు ఎంతో బాధ్యతగా పంచాయతీ శాఖ నిబంధనలకు లోబడి విధులను నిర్వహిస్తున్నాడన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పొన్నాడ పంచాయతీకి సంబంధంలేని నాగులాపల్లి, కొండెవరం పంచాయతీలకు చెందిన బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీను అకారణంగా అసత్య ఆరోపణలతో తరచుగా జిల్లా కలెక్టర్‌కి పీజీఆర్ఎస్‌లో సియోన్‌కుమార్‌ను బదిలీ చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సియోన్‌కుమార్‌ను అడగ్గా తనకు ఏ సమాచారం లేదని వారెవరో ఎందుకు ఫిర్యాదు చేస్తున్నారో తెలియదని చెప్పాడన్నారు. దీనిపై కొంచెం లోతుగా సమాచారం సేకరించగా కాకినాడ డీఎల్‌పీవో ఆఫీసులో ప్రస్తుతం ఏవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటరెడ్డి ఇద్దరితో ఫిర్యాదు చేయించాడని తెలిసిందన్నారు. గతంలో కూడా వెంకటరెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. 12వ ఆర్థిక సంఘం నిధుల తాలూకా వడ్డీని తన ఖాతాకు మళ్లించుకున్నాడని, అతడి సర్వీసులో ఉండగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగం ఇప్పించే విషయంలో బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో మహిళలను కావాలనే ఉద్దేశపూర్వకంగా తన చుట్టూ తిప్పుకుంటూ నచ్చినవారిపై లైంగిక వేధింపులు కూడా చేస్తుంటాడని తెలిసిందన్నారు. ఎస్సీ, బీసీ ఉద్యోగులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటారన్నారు. సీహెచ్ వెంకటరెడ్డి, అతడి అనుచరులు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్‌లపై డిపార్టుమెంటల్ ఎంక్వైరీ జరిపించాలన్నారు. వెంకటరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఆర్వో జె.వెంకటరావుకు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ఆయన సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిణిగా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్ధరాత్రి హాహాకారాలు..!

పెట్రోల్, డీజిల్‌తో ఫ్లాట్‌కి నిప్పుపెట్టిన వైనం

ఆర్తనాదాలతో ప్రాణాలతో బయటపడిన కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో ఘటన



ఫ్లాట్‌లో దగ్ధమైన ఫర్నీచర్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో దారుణం జరిగింది. పెట్రోలు, డీజిల్ పోసి ఫ్లాటుకి నిప్పు పెట్టడమే కాకుండా ఇంట్లో ఉన్న వారిని అగ్నికి ఆహుతి చేసేందుకు యత్నించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఉదంతంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంచలనం రేకెత్తింది. వ్యక్తిగత కక్ష, ఆర్థిక లావాదేవీలే కారణంగా పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వివరాల్లో కెళితే కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల గోపీకృష్ణా రెసిడెన్సీలో మెకానిక్ పిల్లి సత్తిబాబు, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నివసిస్తున్నారు. వారంతా భోజనం చేసి ఆదివారం రాత్రి 12 గంటల తర్వాత పడుకున్నారు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గదిలో నుంచి పెట్రోలు, డీజిల్ వాసన రావడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో మెలుకువ వచ్చి సత్తిబాబు లేచి పరిశీలించగా, పెట్రోలు, డీజిల్ వాసనతో పాటూ మంటలు రావడాన్ని గుర్తించి కుటుంబ సభ్యులను లేపి తలుపులు తీసేందుకు ప్రయత్నించాడు. మంటలతో వీరి హాహాకారాలను గుర్తించిన సమీపం ఫ్లాట్స్ వాసులు వచ్చి ఇంటి తలుపులు, అద్దాలు బద్దలు కొట్టి అతికష్టంపై సత్తిబాబు, భార్య దుర్గ, బాలికలు సృజన, భానుచంద్రిక, ఆరేళ్ల మణికార్తిక్‌ను బయటకు ప్రాణాలతో తీసుకురాగలిగారు. మంటల్లో గదుల్లో ఉన్న ఫర్నీచర్, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన అగ్నిమాపక వాహనంపై సిబ్బంది వచ్చి మంటలను ఆర్పగలగడంతో పక్క పోర్షన్‌లకు పెను ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్ పేలి ఉంటే మరింత ప్రమాదం వాటిల్లి ఉండేది. తాము నివసిస్తోన్న అపార్టుమెంట్ పెంట హౌస్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పిల్లి సత్తిబాబు సర్పవరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. సర్పవరం సీఐ బి.గోవిందరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు సదరు వ్యక్తితో వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలపై పలుసార్లు తగాదాలు పడినట్ట భావిస్తున్నామన్నారు. పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అపార్టుమెంట్ పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ప్రజలంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

అయినవిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బోధనోపకరణాల ప్రదర్శనను మండల విద్యాధికారి పి.శ్రీనివాస్ ప్రారంభించారు.

స్మార్ట్‌కార్డులతో పారదర్శకత

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టి పూర్తి పారదర్శకత అమలుకు కూటమి ప్రభుత్వం రైస్ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజవర్గంలో 77,567 స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు అధ్యక్షతన తహసీల్దార్ వాసా దివాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించారు.

టీడీపీ నాయకుడు రామారావు మృతి



ముమ్మిడివరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీహెచ్‌గున్నేపల్లి గ్రామకమిటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మేకల రామారావు(82) సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పార్టీ నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, అర్థాని శ్రీను, తదితరులు రామారావు భౌతికకాయానికి నివాళులర్పించారు. భార్య నాగమణి మృతిచెందగా ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన

అంతర్వేది, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కేశవదాసుపాలెంలో ప్రధానిమోదీ పుట్టినరోజు సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంవద్ద వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే



సీఎం రిలీఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు సీఎం సహాయం అభినందనీయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం 159మంది లబ్ధిదారులకు రూ.87 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 430 మందికి రూ3.25 కోట్లు సీఎం రిలీఫ్‌గా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, ఏఎంసీ ఛైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, నాయకులు గొలకోటి దొరబాబు, మందల గంగ సూర్యానారాయణ, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, గుద్దటి జమ్మి, పొద్దోకు బాలు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాస్, ధూళిపూడి బాబి, చెల్లి సురేష్, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, మహదశ లక్ష్మీనారాయణ, సంఘాని వెంకటేశ్వరరావు, చిక్కాల అంజిబాబుతదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా మల్లికార్జునరావు



పి.గన్నవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఎంపీడీవోగా జి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు మలికిపురం మండల డిప్యూటీ ఎంపీడీవో హోదాలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు పనిచేశారు. ఇటీవల ఎంపీడీవో పదోన్నతి లభించింది. ఆయనకు డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, పరిపాలనాధికారి వీఎస్‌వీ శర్మ, సిబ్బంది స్వాగతం పలికారు.

ఎంపీడీవోగా మమత



అంబాజీపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట ఎంపీడీవోగా బి.మమత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాట్రేనికోన డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. డిప్యూటీ ఎంపీడీవోగా గతంలో ఆమె ఇక్కడ పనిచేశారు. మమతను ఏవో ఏవీఎల్ నరసింహం, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అభినందించారు. అనంతరం ఎంపీడీవోను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మాలమహానాడు ధర్నా

ఐ.పోలవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులపై డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులుగా తూర్పుగోదావరి జిల్లాగా ముద్రించడం పట్ల మాలమహానాడు సోమవారం ఆందోళన చేపట్టింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీకి సమర్పించారు. స్మార్ట్‌కార్డుల్లో జిల్లా పేరును మార్చకపోతే దశలవారీగా మాలమహానాడు ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రేషన్ స్మార్ట్‌కార్డులపై కోనసీమ జిల్లాగా పేరు మార్పుచేసి పంపిణీ చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సోమ వారం వారు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దారు చినబాబుకు వినతిపత్రాన్ని అందించారు.

హెల్పర్ పోస్టుల్లో అన్యాయం

యానాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యానాం విద్యుత్ శాఖలో 177 హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీలో యానాం నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని యానాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్ కల్పించకుండా రీజియన్ వారిగా రిజర్వేషన్ కల్పించడంతో యానానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని రాజోలు సహాయ పశువైద్య సంచాలకుడు డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. నగరం గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు. ఈకార్యక్రమం అక్టోబరు 15వరకు జరుగుతుందన్నారు.

బుర్రకథ కళాకారుడికి జాతీయ అవార్డు

మామిడికుదురు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు కళాభూషణ్ మంగం సత్యనారాయణకు డాక్టర్ నందమూరి తారకరామారావు జాతీయ అవార్డును అందుకున్నారు. మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణకు అవార్డు ప్రదానం చేశారు.

మహిళలకు ఉచిత శిక్షణ

యానాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కోలాబరేషన్ ఇనిషియేటివ్స్ సేవా సంస్థ ద్వారా ఉమెన్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. స్థానిక బీమ్‌నగర్ కోనా గార్డెన్స్‌లో 20మందికి ఉచితంగా బ్యూటీపార్లర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమానికి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, స్థానిక నాయకుడు లంక వెంకన్నబాబు, రాయవరపు శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లను అందజేశారు. మహిళల ఉపాధికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఎమ్మెల్యేకు శెట్టిబలిజ సంఘం అభినందన

మలికిపురం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శెట్టిబలిజ కులస్థులపై చూపిస్తున్న ప్రేమకు అభినందనగా రాజోలు నియోజకవర్గ శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు సోమవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఆయన ఇంటి వద్ద సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుబ్బల ఫణికుమార్, తాటిపాక ఏఎంసీ ఛైర్మన్‌గా కేతా వెంకటలక్ష్మి, రాజోలు ఎంపీపీగా కడలి శ్రీదుర్గను ఎంపిక చేయడంలో ప్రధానపాత్ర పోషించి శెట్టిబలిజ పక్షపాతిగా నిలబడ్డారని ఎమ్మెల్యేను కొనియాడారు

సాయిబాబారాజు విశ్రాంతి భవనం ప్రారంభం

ఐ.పోలవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎదుర్లంకలో టీడీపీ నాయకుడు ముదునూరి సాయిబాబారాజు విశ్రాంతి మందిరాన్ని సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ప్రారంభించారు. సాయిబాబారాజు విగ్రహనికి ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏఎంసీ ఛైర్మన్ వెంకటలక్ష్మికి అభినందనలు

రాజోలు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాటిపాక ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన కేతా వెంకటలక్ష్మికి తాటిపాకలోని ఆమె స్వగృహంలో సోమవారం జనసేనపార్టీ కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకుడు, అభిమానులు దుశ్శాలువాతో సన్మానించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

అల్లవరం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా పేరుపై ఉన్న రేషన్‌కార్డుల లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం హైస్కూలుసెంటర్ రేషన్‌షాపువద్ద స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, శెట్టిబలిజకార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎంవీవీనరసింహారావు, ఎంపీడీవోలక్ష్మణరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. అర్జీదారుల సమస్యలను ఆయన నేరుగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కీర్తి స్పందన, తహసీల్దారు ఐపీ శెట్టి, ఏవో రమేష్‌కుమార్, గృహ నిర్మాణశాఖ ఏఈ జీవీఎన్ దాసు, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులపై విచారణ జరపాలి: పసలపూడి పంచాయతీలో 2024-25 సంవత్సరంలో డిమాండ్ రిజిస్టర్‌కు రాకుండా చాలా రశీదులు వసూలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని ఇంటి పన్నుల రూపంలో జమ కావాల్సిన నిధులు దుర్వినియోగం కాకుండా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.


అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాయవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఐసీడీఎస్ పీవో పూర్ణిమ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పండ్లు, చీర, గాజులు అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వి.రాంబాబు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కె.వెంకటరమణ, టీడీపీ సీనియర్‌నేత ఉండవిల్లి రాంబాబు, జనసేన నేత దేవిశెట్టి కోటేశ్వరరావు, తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విష్ణుకుమారి, ఈశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంధ్ర దేవి, ఐటీడీపీ సభ్యుడు డి.బాల, ఎంఈవో వై.సూర్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

వెదురుపాక-నదురుబాద రోడ్డుకు నేడు భూమిపూజ

మండలంలోని వెదురుపాక-నదురుబాద రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహిస్తారని టీడీపీ నేతలు వడ్డాది చిన్నకృష్ణం రాజు, సత్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూమిపూజలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, కటారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ మురళీమోహన్

కొత్తపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ ప్రాంగణంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. జ్యూయలరీ షాపులు, హోల్‌సెల్ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపారులు నగదు, విలువైన వస్తువులను షాపుల్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ జి.సురేంద్ర, వ్యాపారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

వృత్తిపన్నుపై అవగాహన సదస్సు

ద్రాక్షారామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం వృత్తి పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు.వాణిజ్య పన్నులశాఖ సహాయ కమిషనరు పి.సత్యనారాయణ మాట్లాడుతూ వృత్తిపన్ను బకాయిలు చెల్లించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సహాయ కమిషనరు ఎస్. రత్నకుమారి, సర్కిల్ జీఎస్‌టీవో జి.అనిత, సుబ్బలక్ష్మి, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సహాయ కమిషనరు

మండపేటను రాజమహేంద్రవరంలో కలపాలి

కలెక్టర్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల వినతి


కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మండపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలంటూ అఖిలపక్ష నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జేఏసీ ఛైర్మన్ కామన ప్రభాకరరావు సారధ్యంలో అఖిలపక్ష నాయకులు దూళి జయరాజు, కె.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గాన్ని కలప డం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు మండపేటను రాజమహేంద్రవరం లో కలిపాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి.మదు, కె.కృష్ణ మూర్తి తదితరులు వున్నారు.


మడికిలో సర్వే నిర్వహిస్తున్న మలేరియా నివారణ అధికారి

మలేరియాను నిర్లక్ష్యం చేయవద్దు

ఆలమూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన జ్వరాల్లో మలేరియా ఒకటని దీన్ని నిర్లక్ష్యం చేయకూడదని కోనసీమ జిల్లా మలేరియా నివారణ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలమూరు మూలస్థానం, మడికి గ్రామాల్లో ఆయన చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లక్ష్మినేహతో కలసి సర్వే నిర్వహించారు. విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి ర్యాపిడ్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, చొప్పెల్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి.శివప్రసాద్, బి.సత్యనారాయణ, ఎల్‌టీ మౌనిక, పలువురు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సిద్దార్థ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు డైరెక్టర్ కె.ముల్లారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బోడసకుర్రులో నిర్వహించిన ఇంటర్ స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారన్నారు. బాలురు సీనియర్స్ -ఏ విభాగంలో కె.చరణ్‌సాయిరామ్ బంగారు పతకం, బీ విభాగంలో కముజం హర్షవర్ధన్ వెండి పతకం, బొరుసు అభిరామ్ కార్తికేయ బ్రాంజ్ మెడల్, బీ విభాగంలో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. వారిని కోచ్ టి.వెంకటలక్ష్మి, ముల్లారావుతో పాటు ఏవో ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, అనిల్ అభినందించారు.


ధ్రువపత్రాలు అందుకున్న సిద్దార్థ విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ రత్నాలరావు తెలిపారు. ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణలో భాగంగా కొత్తూరు, ఆలమూరు, పెదపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ఎస్‌జీఎఫ్ గేమ్స్ వాయిదా

ద్రాక్షారామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో రెండు రోజులపాటు జరగాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అవుట్ డోర్ గేమ్స్ వాయిదా వేసినట్టు డివిజన్ ఎస్‌జీఎఫ్ గేమ్స్ ఇన్‌చార్జి సీహెచ్ లక్ష్మి తెలిపారు. సోమవారం వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఇన్‌డోర్ గేమ్స్ షటిల్, చెస్, యోగా ఎంపికలు నిర్వహించామన్నారు. అవుట్‌డోర్ గేమ్స్ తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

కేంద్ర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాయవరం యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ వీవీ సత్యనారాయణ కోరారు. సోమవారం ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాయోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలతో స్వల్ప ప్రీమియం ద్వారా ఆర్థిక భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బందితో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న దృశ్యం

కాశీ విశ్వేశ్వరస్వామి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ద్రాక్షారామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో నున్న అన్నపూర్ణ, విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వర దక్షిణామూర్తి స్వామివారి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు కాకర్లపూడి రాజగోపాలనరసరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తలుగా తీపర్తి బేబి, ఉప్పరాపల్లి వీరనారాయణమ్మ, కుక్కల సత్యవేణి, మాకం పద్మావతి, నిట్టల సత్యజోగారావు, కొప్పిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, బండి సత్యవీరభద్రరావు, పోతురాజు బాల, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కొంతేటి బాల సుబ్రహ్మణ్యంశర్మలతో దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, నాటక అకాడమీ డైరెక్టరు పెంకె అన్నపూర్ణ, ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిమేన్ కమిటీ ఛైర్మన్ ముప్పనపల్లి గణేష్, మాజీ సర్పంచ్ దామిశెట్టి బాలరాజు, దామిశెట్టి గంగాపురుషోత్తం, మేడిశెట్టి కృష్ణదాసు, భీమేశ్వరాలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ ఈవో వైవీవీ సత్యనారాయణ, కూటమి నాయకులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులను అభినందించారు.


మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజరు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ద్రాక్షారామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీఏసీఎస్‌లో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీసీబీ ద్రాక్షారామ బ్రాంచి మేనేజరు అరిగెల మాణిక్యాంబదేవి మాట్లాడుతూ సహకార సంఘం, బ్యాంకులో లావాదేవీలకు సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సైబర్ మోసాల బారిన పడవద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ త్రీమేన్ కమిటీ ఛైర్మన్ ముప్పనపల్లి గణేష్, సభ్యులు అల్లం రామకృష్ణ, అల్లక మల్లి ఖార్జునరావు, సీఈవో పెంకె సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

అల్లవరం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా పేరుపై ఉన్న రేషన్‌కార్డుల లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం హైస్కూలుసెంటర్ రేషన్‌షాపువద్ద స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, శెట్టిబలిజకార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎంవీవీనరసింహారావు, ఎంపీడీవోలక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

మండపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లంతా హాజరుకావాలని కోరారు.

ఇకపై..కంపోస్టుయార్డులు కనుమరుగు

• ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి • అక్టోబర్ 2నాటికి ఖాళీ మైదానాలుగా మారనున్న వైనం

మండపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఏళ్ల తరబడి కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తగుట్టలు ఖాళీ కానున్నాయి. ఆయా పురపాలక సంఘాల్లో స్వచ్ఛతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వందల టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు రంగం సిద్ధమైంది. వంద టన్నుల మేర పోగైన చెత్తను శుద్ధిచేసే పనులను ప్రజారోగ్య విభాగం ద్వారా చేపట్టనుంది. అక్టోబర్ 2వ తేదీ నాటికి కంపోస్టు యార్డులన్నీ ఖాళీ మైదానాలుగా మార్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఆయా పట్టణాల్లో చెత్తతో నిండిపోయిన యార్డులన్నింటిని ఖాళీ చేయించే పనులకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జూలై ఆఖరులో వాటి పనులను ప్రజారోగ్య విభాగానికి అప్పగించింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన సౌరాష్ట్ర సంస్థతో ఒప్పందం కుదిరింది. మెట్రిక్ టన్ను చెత్తను శుభ్రం చేసేందుకు రూ.840 చెల్లించాలి. జిల్లాలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురంతో పాటు, నగర పంచాయతీ ముమ్మిడివరంలో ఆ సంస్థ చెత్తను శుద్ధిచేసే యంత్రాలను ఏర్పాటు చేసి పనులు చేపట్టింది. ఆయా మున్సిపాల్టీల్లో వున్న కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి పంట పొలాలకు ఎరువుగా వినియోగించనున్నారు. మండే స్వభావం కలిగిన చెత్తను పరిశ్రమలకు, శుద్ధికాని వాటిని గుంతలు తీసి పూడ్చేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆయా పనులకు సంబంధించి టెండర్లు పిలవాలని అధికారులు చూస్తున్నారు.



మండపేటలోని కంపోస్టుయార్డులో నిల్వ వున్న చెత్త. పక్క చిత్రంలో కంపోస్టుగా తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన మిషనరీ



రాయవరంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కపిలేశ్వరపురం మండలం నేలటూరులో పశువులకు టీకాలు ప్రారంభిస్తున్న దృశ్యం


కె.గంగవరం మండలం కోటిపల్లిలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సంయుక్త లక్ష్మి

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు, వాకతిప్ప గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేలటూరులో 261, వాకతిప్పలో 200 పశువులకు టీకాలు వేసినట్టు పశువైద్యాధికారులు వీవీ రమణమూర్తి, లక్ష్మికుమారి తెలిపారు. వారు మాట్లాడుతూ వచ్చేనెల 15 వరకు ఇవి జరుగుతాయని తెలిపారు. 16న వల్లూరు, కోరుమిల్లి, 17న అచ్యుతాపురం, కాలేరు, 18న వడ్లమూరు, నిడసనమెట్ట, మాచర, 19న నల్లూరు, 20న టేకి, 22న వెదురుమూడి, 23న పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, కేదార్లంక, 25న అద్దంకివారిలంక గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరంలో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రాయవరం ఏడీఏ బి.అనితాలక్ష్మి మాట్లాడుతూ గాలికుంటు సోకిన పశువుల్లో మరణాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ పాల దిగుబడి సామర్థ్యం తగ్గుతుందన్నారు. రైతులంతా తప్పనిసరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు రక్షణ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాధులు రాకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి సంయుక్తలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె కోటిపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పామర్రు పశువైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో యండగండి గ్రామంలో 71, గంగవరం పశువైద్యాధికారిణి ఆధ్వర్యంలో గంగవరంలో 71 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆయా ఆసుపత్రి వైద్య సిబ్బంది, గోపాలమిత్ర మేడిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే ప్రమాదకరమైన గాలికుంటువ్యాధికి ముందుగా టీకా వేయడం వల్ల నివారించవచ్చని పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత తెలిపారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నెల రోజులపాటు సాగుతుందని తెలిపారు. మడికిలో సోమవారం గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 600 పశువులకు టీకాలు చేశారు. కార్యక్రమంలో పలువురు పశువైద్యాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సోమవారం క్షేత్రపాలకుడు గోపాలస్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, స్వామివారి నవనీత అలంకరణ, సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, గోపూజ, స్వామివారికి 27 రకాలతో నివేదన నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితో పాటు గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. రాత్రి ఉట్ల ఉత్సవాన్ని ఆనందోత్సవాలతో నిర్వహించారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నవనీత అలంకరణలో వేణుగోపాలస్వామి

ఆత్రేయపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని క్షేత్రపాలకుడు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను వైష్ణవ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. స్వామివారి పంచామృతాభిషేకం, నవనీత అలంకరణ, సాయంత్రం ద్వాదశ నివేదనలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం సాయంత్రం భక్తజనం మధ్య ఉట్ల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


నవనీత అలంకరణలోనున్న వేణుగోపాలస్వామి

రేపు హుండీ లెక్కింపు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారి హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో తెలిపారు.


నియోజకవర్గ బీసీ సెల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

రావులపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి పాటు పడుతోందని కొత్తపేట నియోజకవర్గ బీసీ నాయకులు పేర్కొన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కాసా సాగర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా సమావేశంలో బీసీలకు కార్పొరేషన్ పదవులు ఇవ్వడంతో పాటు వారి అభ్యున్నతికి బాటలు వేసిన సీఎం చంద్రబాబుకు, సహకరించిన ఎమ్మెల్యే సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి ప్రసాద్, కేతా శ్రీనివాసరావు, గుత్తుల పట్టాభి రామారావు, కేతా రాంబాబు, దంగేటి చంటి, చెల్లుబోయిన శ్రీనివాస్, మిద్దే గోపాలకృష్ణ, కోట వెంకటేశ్వరరావు, కుడుపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎఎన్ఎంఎస్) పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు సోమవారం యర్రమిల్లి జయరామ్ ఆధ్వర్యంలో రాజకమల్ ఫౌండేషన్ యుఎస్‌కే సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సలహాదారుడు డాక్టర్ పీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జిల్లాలోని 35 పాఠశాల్లోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించామన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు.

వాహనాల లైసెన్స్‌ను అప్‌డేట్ చేయించుకోవాలి

మండపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాలకు సంబంధించిన లైసెన్స్ నవీకరణ, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండపేట అసిస్టెంట్ లేబర్ అధికారి నాగ మల్లేశ్వరరావు వాహనదారులకు సూచించారు. కార్మికులకు 8గంటల పని విధానం, యూనిఫాం, వాహనంలో ప్రథమ చికిత్స కిట్ ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ వసతి కల్పించడంతో పాటు వెల్ఫేర్‌ఫండ్ చెల్లించాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఫారం పూర్తి చేసి కార్మికుడికి రూ.100 వంతున వెల్ఫేర్‌ఫండ్ చెల్లించాలన్నారు. సకాలంలో లైసెన్స్‌లు కట్టని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి

ఆడబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి

ఆలమూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని మండల వైద్యాధికారులు సూచించారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీలలో వైద్య ఆరోగ్య సిబ్బందికి స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలపై సోమవారం చొప్పెల్ల, పెదపళ్ల వైద్యాధికారులు లక్ష్మిసేహ, సాయికిషోర్‌ల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మహిళలు-ఆరోగ్యం ప్రధానంగా ఈ పథకం లక్ష్యమని వారు తెలిపారు. మహిళల్లో రక్తహీనత, తల్లి శిశు సంరక్షణ, మంచి పోషకాహారం, పరిశుభ్రత, జీవనశైలిపై ప్రత్యేక అవగాహన, మానసిక ఆరోగ్యానికి కౌన్సెలింగ్, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. సమీక్షలో చొప్పెల్ల, పెదపళ్ల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆలయంలో భక్తుల పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం పడినా దాన్ని లెక్కచేయకుండా పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తర్వాత భక్తజనం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల ప్రదక్షిణలు